క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తా


ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి, పార్టీ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ శుక్రవారం తెలిపారు. తనను మైదుకూరు నియోజకవర్గ అబ్జర్వర్‌గా వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించేందుకు, సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేడు కలసపాడులో ప్రచారం

కలసపాడు : కలసపాడులో శనివారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుదర్శన్, జేసీఎస్ కన్వీనర్ చిత్తారాజశేఖర్‌రెడ్డిలు తెలిపారు. కలసపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బూత్ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గేటు రుసుం వసూలు ఎత్తివేయాలి


మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలో ఆటోలు, తోపుడు బండ్లపై రోజువారి బస్టాండ్ గేటు రుసుం వసూలును ఎత్తేయాలని సీపీఐ అనుబంధం ఏఐటీయూసీ నాయకులు కోరారు. శనివారం బస్టాండ్ గేటు రుసుం వసూలుపై జరిగే వేలంపాటలో ఆటోలకు, తోపుడుబండ్లకు మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. ఆ మేరకు మున్సిపల్ మేనేజర్ పరమేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీరాములు, భాస్కర్, షావలి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మరియదాసు

కాశినాయన : ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని చాయ్ సంస్థ నిర్వాహకులు మరియదాసు తెలిపారు. శుక్రవారం నరసాపురంలోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. పరిశుభ్రత, పౌష్టికాహారం, మంచినీటి వినియోగం, మహిళలు ఆర్థికంగా ఎలా ఎదగాలనే అంశాలపై వివరించారు. సమావేశంలో ఏపీఎం వీరాంజనేయులు, సీసీలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు లీడర్లు పాల్గొన్నారు.

పోటాపోటీగా టీడీపీ నేతల ప్రచారం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల పరిధిలో నలుగురు టీడీపీ ప్రముఖ నేతలు శుక్రవారం పోటాపోటీగా బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ ప్రచారం నిర్వహించారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ప్రచారంలో పాల్గొన్నారు. మున్సిపాలిటీలోని 7, 8 వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, సీఎం సురేష్ నాయుడు, మున్సిపల్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. సోమలువారిపల్లె పంచాయతీలోని పెన్నానగర్‌లో టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి మానిక రెడ్డి, సోదరి హరిత రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జబీవుల్లా ప్రచారం నిర్వహించారు.

దుప్పట్లు పంపిణీ


దివ్యాంగులకు దుప్పట్లు అందిస్తున్న విద్యుత్ అధికారులు

ప్రొద్దుటూరు : స్థానిక విద్యుత్ కార్యాలయంలో కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఈఈ జి.శ్రీనివాసులురెడ్డి, శిరీష సహకారంతో శుక్రవారం దివ్యాంగులకు దుప్పట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల, వయో వృద్ధుల సొసైటీ కన్వీనర్ అఫ్జల్, వైచ లపతిరావు పాల్గొన్నారు.

సీఎం జగన్ హామీ మేరకు డ్వాక్రా రుణాలు మాఫీ

- కల్లూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండలంలోని కల్లూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జరగబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని గెలిపించాలని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి, ఉపసర్పంచ్ ఎం.నరేంద్ర, ఉపమండలాధ్యక్షురాలు ఐ.రెడ్డమ్మ, ఆదిశేషారెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

7వ వార్డు మహిళల ఖాతాల్లోకి రూ.40 కోట్లు

స్థానిక 7వ వార్డు పరిధిలోని మహిళల బ్యాంకు ఖాతాల్లోకి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.40 కోట్లు మంజూరైందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. 7వ వార్డు పరిధిలో కౌన్సిలర్ గుర్రం లావణ్య ప్రకాష్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు పూర్తి న్యాయం జరిగిందన్నారు. జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ ఈబీసీ నేస్తం తదితర పథకాల ద్వారా ప్రభుత్వం పేదలకు నేరుగా డబ్బు మంజూరు చేసిందన్నారు. రూపాయి అవినీతి లేకుండా సంక్షేమ పథకాల ద్వారా పేదలు లబ్ధి పొందారన్నారు. గతంలో ఈ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, రూ.150 కోట్లతో అమృత్ పథకం నిర్మించిన తర్వాత నీటి సమస్య తీరిందన్నారు. అడుగడుగునా ప్రభుత్వ తీరుపట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరో మారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని స్పష్టం చేశారు.

ఆర్థిక సాయం

ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రూ.5 వేలు అందించారు. ప్రచారంలో 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి, మాజీ కౌన్సిలర్ పాతకోట కృష్ణవేణి, ప్రొద్దుటూరు కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, కొండా ధనలక్ష్మి, పార్వతి, కమ్మక్క, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవుల ఓబన్న, వీరయ్య, రవికుమార్, చంద్రశేఖర్, బంకా లక్ష్మిరెడ్డి, జి.మాధవరెడ్డి, శివారెడ్డి, లింగమయ్య, నారాయణరెడ్డి, స్నూకర్ భాస్కర్, పగిడాల దస్తగిరి, సుదర్శన్, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘జంబాపురం రామాంజనేయరెడ్డి మా పార్టీకి రెండు సార్లు మోసం చేశాడు’

ప్రొద్దుటూరు : స్థానిక మూడో వార్డు కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయరెడ్డి, వెంకటలక్ష్మిలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రెండు సార్లు మోసం చేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను తొలిమారు జంబాపురం రామాంజనేయరెడ్డికి వైఎస్సార్‌సీపీ తరపున బీ ఫారం ఇచ్చి డబ్బు ఖర్చు పెట్టి పార్టీ కార్యకర్తల సహాయంతో గెలిపించానన్నారు. వెంటనే జంబాపురం టీడీపీ పంచన చేరి తనకు వ్యతిరేకంగా వ్యవహరించాడన్నారు. 2019 ఎన్నికల్లో తాను మళ్లీ విజయం సాధించిన తర్వాత జంబాపురం తన వద్దకు వచ్చి కాళ్లవేళ్లా పడ్డాడన్నారు. కనికరించి రెండో మారు అదే వార్డుకు కౌన్సిలర్ టికెట్ ఇవ్వడంతోపాటు సుమారు రూ.14 లక్షల వరకు వెచ్చించానన్నారు. మళ్లీ జంబాపురం తనను వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వార్డులో ప్రచారం చేస్తున్నారన్నారు. బీ ఫారం తీసుకోవడంతోపాటు డబ్బు ఖర్చు పెట్టినా, కార్యకర్తలు గెలిపించినా మళ్లీ అదే పంథాలో జంబాపురం వైఖరి ఉందన్నారు. ఈ కారణంగానే రెండు మార్లు తనకు మోసం చేసినందుకు మందలించాల్సి వచ్చిందన్నారు.

ఎల్లో మీడియా విష ప్రచారం

ఎల్లో మీడియా ఉద్దేశ పూర్వకంగా తనపై విషప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వెల్లడించారు. టీడీపీకి లబ్ధి చేకూర్చేందుకే ఆ ఛానళ్లు, పత్రికలు ఉన్నాయని ప్రజలందరికీ తెలుసునన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఏడో వార్డు కౌన్సిలర్ గుర్రం లావణ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. శుక్రవారం దువ్వూరులోని ప్రొద్దుటూరు రోడ్డులో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం దువ్వూరు గ్రామ సచివాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో కొన్ని వేల మందికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. టీడీపీ హయాంలో ఒక్క పేద వాడికి కూడా ఒక సెంట్ స్థలం ఇవ్వలేదన్నారు. 2014 నుంచి 2019 వరకు గత ప్రభుత్వంలో అభివృద్ధి ఏమీ జరగలేదన్నారు. 2019 నుంచి 2024 వరకు తమ ప్రభుత్వంలో అభివృద్ధిని పరుగులు పెట్టించామన్నారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో దువ్వూరు మండలంలో కొన్ని కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. దువ్వూరు – ప్రొద్దుటూరు రోడ్డు గతంలో చాలా అధ్వానంగా ఉండేదని, రూ.3 కోట్లతో కొత్త రోడ్డును నిర్మించామన్నారు. నేలటూరు గ్రామంలో కుందూ నదికి వరద వస్తే ఆ గ్రామ ప్రజలు చాలా ఇబ్బంది పడేవారన్నారు. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.2.20 కోట్లతో ఖర్చు చేసి బ్రిడ్జి, రోడ్లు నిర్మించామన్నారు. దువ్వూరు గ్రామంలో రూ.2కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. బుక్కాయపల్లె గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. జిల్లెల్ల నుంచి పెద్దబాకరాపురానికి వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా ఉండేదన్నారు. ఆ రోడ్డు నిర్మాణం కోసం రూ.35 లక్షలతో త్వరలో రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. గతంలో మండల కేంద్రంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేదని, ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మించి ప్రజలకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు ఎలా ఉన్నాయి, నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన తర్వాత ఎలా ఉన్నాయో ప్రతిపక్షాలకు కనిపించలేదా అని ప్రశ్నించారు. గ్రామాల్లోకి వెళితే వారికి అభివృద్ధి కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో జరిగే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ నరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కానాల ఓబుళరెడ్డి, దువ్వూరు సర్పంచ్ చెంద్రాయుడు, ఉపసర్పంచ్ మురళి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, జేసీఎస్ కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వీవీ స్వామి, దువ్వూరు సొసైటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి, కోగటం వీరారెడ్డి, చిరాకి గౌస్ బాషా, పీరు జాత షాబీర్ హుసేన్, కుంపటి ఖాజాపీర్, ఎంపీటీసీలు, సర్పంచ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

మండలంలోని జిల్లెల నుంచి పెద్దబాక్రాపురం వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి శనివారం భూమి పూజ చేయనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

రైతాంగ పోరాటానికి మద్దతుగా నిరసన



ప్రొద్దుటూరు : సీఐటీయూ నాయకుల నిరసన



పోరుమామిళ్ల : సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రొద్దుటూరు : ఢిల్లీ కాల్పుల్లో చనిపోయిన రైతుకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రాజీవ్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు 15 రోజులుగా ఆందోళన చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ సరిహద్దుల్లో సిటీలోకి రైతులు రాకుండా రోడ్లపై మేకులు కొట్టడం, సిమెంటు గోడలు నిర్మించి కర్కషంగా వ్యవహరిస్తోందన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించమని రైతులు అడుగుతుంటే వారిపై కాల్పులు జరపడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎన్నికల ముందు రైతే దేశానికి వెన్నెముక అని చెబుతుంటారు.. కానీ వారి సమస్యలను పరిష్కరించమంటే ఇలా దాడులు దిగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి, రవి, శేఖర్, చెన్నారెడ్డి, సర్వేశ్వరి, రాములమ్మ, వెంకటేష్, శీను, హరి పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

పోరుమామిళ్ల : పంజాబ్, హర్యానా రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటిస్తూ శుక్రవారం పోరుమామిళ్లలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ గతంలో సుదీర్ఘకాలం రైతులు నడిపిన ఉద్యమ ఫలితంగా బీజేపీ ప్రభుత్వం దిగివచ్చి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఇప్పుడు రైతులు మళ్లీ పోరాటం చేస్తున్నారన్నారు. ఆనాటి కేసులు ఎత్తివేసి, రైతుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని కోరారు. రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. అన్నం పెట్టే రైతు అల్లాడరాదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, చెన్నయ్య, రామకృష్ణ, రవి, బీబి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

బద్వేలు అర్బన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతాంగ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీపీఎం పట్టణ నాయకులు ఎం.చిన్ని పేర్కొన్నారు. రైతన్నల ఉద్యమంపై బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ శుక్రవారం స్థానిక సిద్దవటం రోడ్డులోని పూలే విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగార్జున, మస్తాన్‌షరీఫ్, ఆంజనేయులు, మోక్షమ్మ, బాలమ్మ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ లెక్చరర్స్‌ను ఇన్విజిలేషన్ విధుల్లోకి తీసుకోవాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 15వ తేదీ నుంచి జరుగబోయే ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రైవేట్, అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న లెక్చరర్స్‌ను ఇన్విజిలేషన్ విధుల్లోకి తీసుకోవాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గెడ్డం రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై ఇంటర్మీడియెట్ సెక్రటరీ సౌరవ్ గౌరవ్ వినతి పత్రం అందించి, ఫోన్‌లో మాట్లాడటం జరిగిందని ఆయన పేర్కొన్నారు. జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ప్రైవేటు లెక్చరర్స్ సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

బీజేపీ ప్రజా పోరు

చాపాడు : మండల పరిధిలోని కేతవరం, వీరభద్రాపురం, అల్లాడుపల్లె, శ్రీరాములపేట గ్రామాలలో శుక్రవారం బీజేపీ నాయకులు ప్రజా పోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు చిన్న గోపాల్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథ కాంప్లెక్స్‌లో నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం శ్రీరంగనాథుడు సతీసమేతుడై రాత్రి సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ పురవీధులైన మెయిన్ బజార్, ముత్యాల వారి వీధి, గాడిచర్ల వీధి, అమ్మవారిశాల మీదుగా స్వామివారి ఊరేగింపు జరిగింది. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ ప్రాంగణంలో శ్రీధర్‌శర్మచే భక్తి గీతాలను ఆలపించారు. రాత్రి భాగవతారిని ప్రమీలచే గొప్ప హరికథా కాలక్షేపం నిర్వహించారు. భక్తులు హాజరై దేవదేవున్ని దర్శించుకున్నారు.

హెచ్ఐవీపై కళాజాతా

మైదుకూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్ఐవీపై అవగాహన కల్పించేందుకు కళాజాతా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కళాజాతాలో హెచ్ఐవీ వ్యాప్తిపై, నివారణపై వీధి నాటకాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.నారాయణరెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, వైద్య సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: పట్టణంలోని 2 వ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య విషయంలో ముఖ్యమంత్రి జగనన్న రాజీ పడటం లేదన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. 104, 108, ఆరోగ్యశ్రీ కొనసాగుతున్న నేపథ్యంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేశారని, అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్టు డాక్టర్లను గ్రామాల్లో ఏర్పాటు చేసే శిబిరాలకు పంపించి, వైద్యసేవలందిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 25 లక్షలకు పెంచారని, క్యాన్సర్ రోగులకు పరిమితి లేకుండా ఎంతైనా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పిన సాటిలేని నాయకుడు జగనన్న అన్నారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యుల పోస్టులు భర్తీ చేశారని, ప్రజలకు సకాలంలో మంచి వైద్యం అందించాలన్న తపన ఆయనలో కనిపిస్తున్నదన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి రాష్ట్రానికి అవసరమన్నారు. జగనన్న మరో పాతిక సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండాలన్నారు.

ముసల్‌రెడ్డిపల్లె పంచాయతీ కార్యకర్తలతో..

ముసల్‌రెడ్డిపల్లె పంచాయతీకి చెందిన నాయకులతో, కార్యకర్తలతో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి సమావేశం నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాల గురించి చర్చించారు. మండలంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు అత్యధిక ఓట్లు పోల్ అయ్యేలా కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముసల్‌రెడ్డిపల్లె పంచాయతీలో నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో ఉండాలని, పార్టీ పథకాలు గుర్తు చేస్తుండాలని, జగనన్న ప్రతి ఇంటికి మేలు చేశారని వివరించారు.

గాడ్గే బాబా జీవితం.. ఆదర్శనీయం


బద్వేలు అర్బన్ : గాడ్గేబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : సంఘసంస్కర్త, స్వచ్ఛభారత్ ఆద్యుడు సంత్‌గాడ్గే బాబా మహరాజ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైవీయూ పాలకమండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు, పూలే ఆశయసాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి పేర్కొన్నారు. గాడ్గేబాబా 148వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక పూలే ఆశయసాధన సమితి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సమాజంలోని దురాచారాలను, మానసిక, శారీరక అసమానతలను తొలగించుటకు చీపురు చేతపట్టి ప్రతి గ్రామంలోని వీధులు, దేవాలయాలను ఊడ్చుతూ ప్రజలను మేల్కొల్పిన గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. తొలుత గాడ్గేబాబా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బయ్యయాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణయాదవ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆవాజ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, అన్వర్‌బాష, సీనియర్ దళిత నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, దళిత సంఘం నాయకులు వెంకటరమణ, మత్స్యకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బోలానారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: సంత్ గాడ్గేబాబా సేవలు అనితర సాధ్యమని ఆలిండియా దోబీ మహాసంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోవిందాయపల్లె క్రిష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక వివేకానంద భవన్‌లో గాడ్గే బాబా 148వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి ఘటించారు. అనంతరం క్రిష్ణయ్య మాట్లాడుతూ మహారాష్ట్రలోని అమరావతి జిల్లా అంజన్‌గావ్ తాలూకా సెన్‌గావ్‌లో 1876లో రజక కుటుంబంలో జన్మించిన బాబా స్వచ్ఛభారత్ పితామహుడిగా పేరు పొందారన్నారు. నిరక్షరాస్యుడైన బాబా శరణాలయాలు, గోశాలలు, ధర్మశాలలు, పాఠశాలలు, వసతిగృహాలు, ఆసుపత్రులు, ట్రస్టులు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించారన్నారు. మహాత్మాగాంధీ, మదన్‌మోహన్ మాలవ్యా, అంబేడ్కర్‌లు బాబా సేవలు కొనియాడారన్నారు. ప్రభుత్వం 1999లో గాడ్గేబాబా తపాలాబిళ్ల విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల రజక నాయకులు, విశ్రాంత ఉద్యోగులు గురుమూర్తి, గురప్పుడు, వెంకటేశ్వర్లు, మధు, ఓబయ్య, సుబ్బరాయుడు, గురయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి


వైద్య సిబ్బందితో సమావేశమైన టాస్క్‌ఫోర్స్ కమిటీ జిల్లా అధికారి రమేష్‌రెడ్డి

గోపవరం : గర్భవతులు, బాలింతలు ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ జిల్లా స్టాటస్ అధికారి ఎ.రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మడకలవారిపల్లె సచివాలయంలో అనీమియాకు సంబంధించి గర్భవతులు, బాలింతలు, 10 నుంచి 19 సంవత్సరాల బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించారు. వచ్చిన రిపోర్టుల ఆధారంగా వారికి తీసుకోవాల్సిన వైద్యం పట్ల అవగాహన కల్పించారు. గర్భవతులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వలన రక్తహీనత బారిన పడకుండా ఉండే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్యం పట్ల అందుబాటులో ఉన్న హెల్త్‌క్లినిక్, ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం చేయించుకోవాలన్నారు. నిరంతరం వైద్య సిబ్బందితో పాటు ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శరత్‌చంద్ర, డీపీహెచ్‌ఎన్‌ఓ భారతి, ఏఎస్‌ఓ జాకబ్, ఆర్‌సీహెచ్ నారాయణ, సీహెచ్‌ఓ గౌస్, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి


పర్లపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

రాజుపాళెం : త్వరలో జరగబోవు ఎన్నికలను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. మండలంలోని పర్లపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామస్తులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తమకు నచ్చిన వారికి ఓటు వేసుకోవచ్చునని, ఎటువంటి సమస్యలు లేకుండా నిర్వహించుకోవాలన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే గొడవలు చేసుకోవద్దని, పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రూరల్ సీఐ రమణారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లకోసారి ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయని తెలిపారు. ఎన్నికల్లో ఒక సారి గొడవలు చేసుకుంటే ఆ విషయం రికార్డుల్లో నిలిచి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ తులసి నాగప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్

బద్వేలు అర్బన్ : అందరం కలిసికట్టుగా పోలియో రహిత సమాజం కోసం కృషి చేద్దామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్ పేర్కొన్నారు. మార్చి 3న జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సిబ్బందికి శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 5 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి, వారందరికీ పోలియో చుక్కలు అందేలా సిబ్బంది కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జోత్స్నస్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సౌమ్య, ఎంఈఓ ప్రమీల, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, సీహెచ్ఓ చంద్రావతి, సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల, కాశినాయన, బి.కోడూరు మండలాల్లోని గ్రామాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీ, ఏఈఈలు తెలిపారు. 132 కేజీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరా నిలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా
Bank of Baroda
బంగారు నగల వేలం ప్రకటన
తేదీ.13-03-2024, (బుధవారం) మ.3.00 గం.లకు బ్యాంకు ఆవరణలో వేలం వేయబడును.
రూ.10,000/-

లోన్ ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు, తండ్రి పేరు మరియు చిరునామా	బంగారు గ్రాములలో
58920600018077	[illegible]	5.50

తేదీ : 23.02.2024
సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా